# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-03-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- క్లీన్ ఎనర్జీ కంపెనీలకు లీజు ప్రాతిపదికిన అసైన్డ్ భూములను కేటాయించనున్నామని మంత్రి అనగాని సత్య ప్రసాద్ వెల్లడించారు.
- రైతులను లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని అమలు చేస్తోందని మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు.
- ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్ మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు మధ్య కోలకతా వేదికగా ఈ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది.

======================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్)పై అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ ఐడీ, ఆధార్ నెంబర్, రైస్ కార్డ్ ఐడీ, విద్యార్హతలు, వృత్తి, మొబైల్ నెంబర్, చిరునామా, వ్యవసాయ భూమి, అర్బన్-రూరల్ ప్రాపర్టీ వంటి మొత్తం 26 వివరాలతో కూడిన ఫ్యామిలీ డేటాబేస్ రూపొందించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 82 శాతం సమాచారం ఉందని, వచ్చే ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ సిద్ధం చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. అయితే ప్రభుత్వంలోని అన్ని శాఖల దగ్గర ఉన్న డేటాబేస్ సమీకృతం చేయాలని, అప్పుడు కచ్చితత్వం పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగా అధికారులు పని చేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

======================

యువతకు ఉపాధితో పాటు అసైనీదారులకు అదనపు ఆదాయం కల్పించడం కోసం అసైనీ చట్టానికి సవరణ చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. గత గురువారం ఈ చట్ట సవరణకు శాసనసభ ఆమోదం తెలపగా.. శాసనమండలి ఈరోజు ఆమోదించింది. క్లీన్ ఎనర్జీ కంపెనీలకు లీజు పద్దతిలో అసైన్డ్ భూములను కేటాయించానున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలంటే కొన్ని చోట్ల అసైన్డ్ భూములు అవసరమని, అందుకే లీజు ప్రాతిపదికన ఆ భూములు తీసుకునేందుకు చట్ట సవరణ చేస్తున్నట్లు చెప్పారు. 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పంలో ఈ చట్ట సవరణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

=====================

రైతులను వరి సాగు నుండి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. శాసన సభలో ఆయన ఈరోజు ప్రత్యామ్నాయ పంటల సాగు, మద్దతు ధరలు, సేంద్రీయ వ్యవసాయం, కౌలు రైతుల రుణాలు మొదలగు అంశాలపై వివరణ ఇస్తూ.. రాష్ట్రంలో వరి సాగు చేస్తున్న రైతులు సుమారు 38.97 లక్షల మంది ఉన్నారని చెప్పారు. అధికంగా వరి సాగు చేయటం వల్ల భూగర్భ జలాల వినియోగం పెరుగుతోందని ఇందుకు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు వంటి పంటలను ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు, నాణ్యమైన విత్తనాల సరఫరా, సాంకేతిక మార్గదర్శకాలు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. 15 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటలను సాగు చేసేలా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వివరిస్తూ…

(వాయిస్ 29 సెకన్లు)

=====================

సింహాచలం పంచ గ్రామాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని విశాఖపట్టణానికి చెందిన పలువురు శాసన సభ్యులు కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శాసనసభలో ఈరోజు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ అంశంపై చర్చ ప్రారంభించగా పెందుర్తి, గాజువాక, విశాఖ పశ్చిమం, ఉత్తరం నియోజక వర్గాల శాసన సభ్యులు ఈ చర్చలో పాల్గొని మాట్లాడారు. విశాఖలోని వేపగుంట, అడవివరం, చీమలాపల్లి, వెంకటాపురం, పురుషోత్తపురం గ్రామాల పరిధిలోని నివాసితులు, రైతులు తమ కష్టార్జితంతో స్థలాలు కొన్నా యాజమాన్య హక్కులు దక్కకపోవడంతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారని సభకు వివరించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం చూపి వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు ప్రభుత్వాన్ని కోరారు. పంచ గ్రామాల సమస్యపై కొత్తగా ఒక కమిటీ వేసి, నిర్ణీత సమయంలో పరిష్కారం అయ్యేలా చూడాలని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు విజ్ఞప్తి చేశారు.

విరామం

=====================

గర్భిణీలు, బాలింతలకు సరైన పోషణ అందించడంతో పాటూ.. వారు ఉపాధికి దూరమైనప్పుడు వేతన నష్టాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం మాతృ వందన పథకాన్ని ప్రవేశపెట్టిందని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆనంతపురం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈరోజు ఆమె జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆకాశవాణితో మాట్లాడుతూ… పీఎం మాతృ వందన యోజన పథకంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ఏడాది 11 వేల 210 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 9 వేల మంది ఈ పథకం కింద నమోదు అయ్యారని చెప్పారు. గర్భిణీలు దగ్గరలో ఉన్న అంగన్వాడి కేంద్రానికి వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. గర్భిణీలకు ప్రసవానికి ముందు రెండు దఫాలుగా మొత్తం 5 వేల రూపాయలు అందుతాయని ఆమె వెల్లడిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

=====================

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందస్తు కార్యక్రమాలను తిరుపతి జిల్లాలోని విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్థానిక కళాశాలలో ఈరోజు జరిగిన ఒక అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలు, టీనేజ్ వయస్సులో ఎదురయ్యే ఆకర్షణలు, వాటిని నియంత్రించకపోతే భవిష్యత్‌లో ఎదురయ్యే పరిణామాలపై ఈ కార్యక్రమాల్లో వివరిస్తున్నట్లు తెలిపారు. అమ్మాయిలు అన్ని రంగాలలో ముందంజలో నిలవాలని, జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ధైర్యంగా ఎదుర్కొనే మనోబలాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.

=====================

రాష్ట్రంలో ప్రస్తుతం 32 వేల 970 రెవెన్యూ కేసులు పెండింగ్ లో ఉన్నాయని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. 2005 వరకు 4 కేసులు మాత్రమే పెండింగ్ లో ఉండగా నేడు అవి 32 వేలకు చేరుకున్నాయని చెప్పారు. శాసన సభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పెండింగ్ లో ఉన్న రెవెన్యూ కేసులపై వివరణ ఇస్తూ... హైకోర్టులో నమోదైన కేసుల పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో లైజనింగ్ ఆఫీసర్లను నియమించామని చెప్పారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ నాయకత్వంలో లీగ్ సెల్ ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భూ వివాద కేసుల పరిష్కారంలో ఎవరైనా అధికారులు తప్పు చేస్తే సహించేది లేదన్నారు. భూ వివాదాల్లో రికార్డులను తారుమారు చేసిన కొందరు అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

అమరావతి రాజధాని ప్రాంతం పరిధిలోని గ్రామాలలో 27 కోట్ల రూపాయలతో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు జారీ చేశామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ విజ్ఞప్తి మేరకు తుళ్లూరు మండలంలోని 18 గ్రామాల్లో అత్యాధునిక వసతులతో కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తామని చెప్పారు. ఇటీవల చేపట్టిన గ్రామ సభల్లో రైతుల నుంచి కూడా ఇటువంటి వినతులు అందాయని వెల్లడించారు.

=====================

ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్ మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య కోలకతా లోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనుంది. ఈ రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. గత ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఓడిన దక్షిణాఫ్రికా ఈ సారి ట్రోఫీ గెలిచేందుకు ఈ మ్యాచ్‌లో విజయం సాధించి మరో సారి ఫైనల్ కు చేరుకోవాలని సిద్ధమవుతోంది.

=====================

విజయనగరం జిల్లాలో జరుగుతున్న రీ సర్వే, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఈరోజు జిల్లా కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

=====================

=====================